క్లుప్తంగా

వేగంగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

అచ్చంపేట: మండలంలో నిరుపేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతోందని తహసీల్దారు కె.ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన వివరాలు వెల్లడించారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో 2 వేలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. లబ్ధిదారులకు శాశ్వత హక్కు కల్పించేందుకు ఇప్పటికి 800లకుపైగా ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ చేసినట్లు చెప్పారు. మిగిలిన వాటికి కూడా రిజిస్ట్రేషన్లు త్వరగా పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని, గ్రామ రెవెన్యూ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

మట్టిఖర్చులు అందజేత

పెదకూరపాడు: లగడపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మన్నేపల్లి నాగమ్మ గురువారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ నాయకులు బత్తుల కోటేశ్వరరావు, ఎంపీటీసీ షేక్ బుడా, అల్లాబక్షు, మస్తాన్‌ల ద్వారా మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం నుంచి లబ్ధిని అందిస్తామని భరోసా కల్పించారు.

క్రోసూరు ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ



క్రోసూరు: మండల ఎస్‌ఐగా షేక్ మహమ్మద్ షఫీ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన పల్నాడు సీసీఎస్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్‌ఐ వి.నరసింహులు అమరావతి మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ విలేకరులతో మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతలు కాపాడుతానని, ఫ్రెండ్లీ పోలీసు అమలు చేస్తానని తెలిపారు.

వృత్తి విద్యా కోర్సులే ఉపాధి సోపానాలు



మాదల(ముప్పాళ్ళ): వృత్తి విద్యా కోర్సులే భవిష్యత్తుకు ఉపాధి సోపానాలు అని మాదల జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రమేష్ అన్నారు. ఏపీ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సుల్లో భాగంగా లెర్నెట్ స్కిల్స్ సహకారంతో పాఠశాల విద్యార్థులు గురువారం ఇండస్ట్రీయల్ విజిట్ నిర్వహించారు. టెక్స్‌టైల్స్, టైలరింగ్ లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు వస్త్రం తయారీ ప్రక్రియలో వివిధ దశలను ప్రత్యక్షంగా చూసి, తెలుసుకున్నారు. ఫణిదం సొసైటీ అధ్యక్షుడు కేఎస్ దుర్గారావు వివిధ రకాల డిజైన్లను ఎలా తయారు చేస్తారో.. వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.పెరుమాళ్లు, జి.కృష్ణ, ఎ.మంగయ్య, ఎ.బాగేశ్వరి, యు.సత్యవతి, వృత్తి విద్యా శిక్షకులు వి.రామాంజనేయులు, కేడీఎల్ ప్రసాద్ పాల్గొన్నారు.

సాతులూరులో వైభవంగా సిడిమానోత్సవం



నాదెండ్ల: మండల పరిధిలోని సాతులూరు గ్రామంలో కొలువైయున్న గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం గురువారంతో ముగిసింది. గత నెల 31న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సిడిమానోత్సవం నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయబద్ధంగా మేళతాళాలతో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

టిప్పర్ ఢీకొని వెల్లటూరు వాసి దుర్మరణం

వినుకొండ (నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన వినుకొండ రూరల్ చీకటీగలపాలెం అడ్డరోడ్డు వద్దనున్న పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. బొల్లాపల్లి మండలం వెల్లటూరు గ్రామానికి చెందిన పుట్టిగంపల నాగేశ్వరరావు (48) ద్విచక్ర వాహనంపై వెల్లటూరు వెళ్లే క్రమంలో, టిప్పర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నరసరావుపేట టౌన్: ప్రకాష్‌నగర్‌లో మానసిక స్థితి సరిగ్గా లేని స్వరూపారాణి అనే యువతి అదృశ్యమైనట్లు ఆ యువతి అన్న ఆనంద్ ఫిర్యాదు చేసినట్లు ఒన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి గురువారం వెల్లడించారు. ప్రకాష్‌నగర్ వన్నూరుకుంట పార్కు సమీపంలో నివాసం ఉండే స్వరూపారాణి ఈనెల ఒకటో తేదిన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదని, ఆమె ఆచూకీ కోసం వెతికినా లభ్యంకాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వెల్లడించారు.

గ్రామ పంచాయతీలకు నిధుల వరద

పంచాయతీలకు ఆర్థిక దన్ను కల్పించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది. వీటితో సీసీ రోడ్లు, కాల్వలు, తాగునీరు, పారిశుద్ధ్యం పనులు చేపట్టేందుకు అవకాశం ఏర్పడింది. గ్రామ పంచాయతీల్లో కొత్త పాలన వచ్చి మూడేళ్లయింది. సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో సర్పంచ్‌ల పాలన ఉన్న అన్ని పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.15.15 కోట్లు జమ అయ్యాయి. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన ఆయా పంచాయతీల ఖాతాల్లో పబ్లిక్ ఫైనాన్షియల్ మేనేజ్మెంట్ సిస్టం (పీఎఫ్ఎంఎస్) ద్వారా జమ చేసింది.



కొమెరపూడి గ్రామ సచివాలయం

- 15వ ఆర్థిక సంఘం నిధులతో దన్ను
- సత్తెనపల్లి డివిజన్‌కు రూ.15.15 కోట్లు మంజూరు
- గ్రామాల్లో కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలకు అవకాశం
- అభివృద్ధి ప్రణాళిక ఆధారంగా పనులు

సత్తెనపల్లి: 15వ ఆర్థిక సంఘం నిధులతో గ్రామ పంచాయతీల్లో సీసీ రోడ్లు, కాల్వల నిర్మాణాలతో పాటు పారిశుద్ధ్య పనులు, వివిధ రకాల చార్జీల చెల్లింపు, చెత్త నుంచి సంపద ఉత్పత్తి కేంద్రాల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాలు చెల్లించవచ్చు.

అన్ని పంచాయతీలకు లబ్ధి..

సత్తెనపల్లి రెవెన్యూ డివిజన్ పరిధిలోని 9 మండలాల్లోని అన్ని గ్రామ పంచాయతీలకు 2022–23 ఆర్థిక సంవత్సరంలో ఇచ్చిన ముందస్తు ప్రణాళిక ద్వారా మొదటి విడత కింద రూ.5,38,84,483లు, రెండో విడత కింద రూ.9,76,67,282 వెరసి మొత్తం రూ.15,15,51,765 నిధులు విడుదలయ్యాయి. దీంతో ఆయ పంచాయతీల్లో అభివృద్ధి పనులు ఊపందుకొనున్నాయి. మారుమూల ప్రాంతాలు, అనుబంధ గ్రామాలు, కొత్తగా ఏర్పడిన పంచాయతీల్లో ఈ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఈ నిధులపై రాష్ట్ర ప్రభుత్వం పర్యవేక్షణ ఉంటుంది. పంచాయతీలో వివిధ ఖర్చులకు సంబంధించిన బిల్లులకు ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్ లో నమోదు చేయాల్సి ఉంటుంది.

డివిజన్‌లో మండలాల వారీగా మంజూరైన నిధులు..

మండలం	మొదటి విడత బేసిక్, టైడ్ గ్రాంట్ రూ.	రెండవ విడత బేసిక్, టైడ్ గ్రాంట్ రూ.	మొత్తం రూ.
సత్తెనపల్లి	89,75,485	1,48,65,069	2,38,40,554
ముప్పాళ్ళ	42,65,090	80,60,250	1,23,25,340
రాజుపాలెం	52,19,644	85,84,548	1,38,04,192
నకరికల్లు	79,47,943	1,26,33,688	2,05,81631
అమరావతి	58,47,711	1,32,67,143	1,91,14,854
అచ్చంపేట	65,86,279	1,19,76,932	1,85,63,211
క్రోసూరు	62,72,527	1,11,45,736	1,74,18,263
పెదకూరపాడు	46,21,750	99,34,108	1,45,55,858
బెల్లంకొండ	41,48,054	71,99,808	1,13,47,862
మొత్తం	5,38,84,483	9,76,67,282	15,15,51,765

మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి



గ్రామ పంచాయతీలకు విడుదలైన 15వ ఆర్థిక సంఘం నిధులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఖర్చు చేయాలి. ప్రాధాన్యత క్రమంలో ప్రజల సమస్యలను పరిష్కరించాల్సి ఉంటుంది. అభివృద్ధి పనులకు ఉపయోగించిన నిధుల వివరాలు, బిల్లులను గ్రామ స్వరాజ్య ఈ–పోర్టల్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఈ నిధులు గ్రామ పంచాయతీల అభివృద్ధికి దోహదపడతాయి.

– ఎస్.జగదీష్, ఎంపీడీవో, సత్తెనపల్లి

విధి విధానాలు..

పంచాయతీలకు జమ అయిన నిధులు టైడ్, అన్‌టైడ్ కింద విడుదల అవుతాయి. టైడ్ కింద రహదారులు, డ్రెయినేజీలు, కల్వర్టుల నిర్మాణం, కరెంటు బిల్లులు చెల్లింపు, గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న అంగన్వాడీ, హెల్త్ సెంటర్, పంచాయతీ భవనాల అభివృద్ధికి వినియోగించుకోవాలి. అన్‌టైడ్ నిధుల కింద తాగునీటి అవసరాలు, చేతి పంపులు, నీటి ట్యాంకులు, మోటార్ల నిర్వహణ చేసుకోవాలి.

ప్రజా సేవే లక్ష్యం

- ఎమ్మెల్యే నంబూరు శంకరరావు
- రూ.3కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

దొడ్లేరు(క్రోసూరు): ప్రజలకు మంచి చేయాలన్న సంకల్పంతోనే తను రాజకీయాల్లోకి వచ్చినట్లు పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం రాత్రి మండలంలోని దొడ్లేరు గ్రామంలో రూ.3 కోట్ల విలువైన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఇంటింటికీ మంచినీరు అందించేందుకు రూ.2.54 కోట్లతో జల జీవన్ మిషన్ పనులను , రూ.40 లక్షలతో నిర్మించిన ముస్లిం షాదీ ఖానాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ నేతల మాదిరి దోచుకోవడానికి, దాచుకోవడానికి తాను రాజకీయాల్లోకి రాలేదన్నారు. ప్రజలకు మంచి చేయాలని, వారి గుండెల్లో స్థానం సంపాదించాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నంబూరు స్పష్టం చేశారు. దొడ్లేరులో ప్రతి కుటుంబానికి సంక్షేమం ద్వారా మేలు చేశానని తెలిపారు. తను చేసిన దాంట్లో కనీసం పది శాతం అభివృద్ధి గత ప్రభుత్వం అభివృద్ధి చేసిందా..? అని ప్రశ్నించారు. సీఎం వైఎస్ జగన్ 2.08 లక్షల ఉద్యోగాలు ఇచ్చారని, గత ప్రభుత్వానికి, మంచి చేస్తున్న తమ ప్రభుత్వానికి తేడా చూడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దొడ్లేరు అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారో.. 2019 నుంచి ఇప్పటి వరకు సీఎం వైఎస్ జగన్ ఏం చేశారో చూడాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా దొడ్లేరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త షేక్ గణపవరం సైదా వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, ఎంపీపీ పి.కోటయ్య, అనుముల కోటిరెడ్డి, గ్రామ సర్పంచ్ ముక్కు అంజలి, సయ్యద్ అబ్దుల్ రహీం, ఆవుల అంకిరెడ్డి , వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



దొడ్లేరులో నీటి కొళాయి ప్రారంభించిన ఎమ్మెల్యే నంబూరుశంకరరావు

అనంతవరంలో హెల్త్ వెల్ నెస్ సెంటర్ ప్రారంభం

అనంతరం గ్రామంలో హెల్త్ వెల్ నెస్ సెంటర్‌ను ఎమ్మెల్యే నంబూరు ప్రారంభించారు. అనంతవరం గ్రామంలో గతంలోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పాఠశాల అభివృద్ధి, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గ్రామంలో రోడ్లు, డ్రెయిన్లు పూర్తి చేశామన్నారు. పులిచింతల బ్యాక్ వాటర్ నుంచి మూడు పంటలకు సాగునీరు అందించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

భూతాప నివారణ చర్యలు చేపట్టాలి

సత్తెనపల్లి: సంపన్న దేశాలు.. పేద దేశాలకు ఆర్థిక సాయం అందజేసి, భూతాప నివారణకు చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి. కృష్ణయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగిన సీపీఎం పల్నాడు జిల్లా శాఖ కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశానికి పార్టీ నేత ఎస్.ఆంజనేయ నాయక్ అధ్యక్షత వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కొత్త ఉద్యోగాలు కల్పించక పోవడంతో 45 కోట్ల మంది నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్నారన్నారు. సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్ మాట్లాడుతూ ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త గ్రామీణ బంద్‌లో కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొని, ప్రధాని మోదీ ప్రభుత్వ విధానాలపై నిరసన వ్యక్తం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏవీఎస్ గోపాల్ రావు, అనుముల. లక్ష్మీశ్వరరెడ్డి, వై రాధా కృష్ణ, జి.రవిబాబు, కమిటీ సభ్యులు గుంటుపల్లి బాలకృష్ణ, గుంటూరు మల్లేశ్వరి, పెండ్యాల మహేష్, హనుమంతు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కృష్ణయ్య

నూతన ఎంపీడీఓకు అభినందనలు

అచ్చంపేట: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కుసుమ కుమారిని గురువారం వైఎస్సార్ సీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. జెడ్పీటీసీ తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గంగసాని నరసింహారెడ్డి, వ్యవసాయ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ నెల్లూరి చంద్రబాబు తదితరులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపి దుశ్శాలువాతో సత్కరించారు.



ఎంపీడీఓ కుసుమకుమారిని అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి ఆర్డీఓ మురళీకృష్ణ

సత్తెనపల్లి: ఎన్నికల నిర్వహణలో సెక్టోరల్ అధికారులదే కీలక పాత్ర అని సత్తెనపల్లి ఆర్డీఓ వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో గురువారం నియోజకవర్గ పరిధిలోని సహాయ ఓటర్ల నమోదు అధికారులు, సెక్టార్ ఆఫీసర్లకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సమయంలో ఈవీఎంలు మొరాయిస్తే.. సకాలంలో ప్రత్యామ్నాయం చూడటంలో కీలక పాత్ర సెక్టోరల్ అధికారులదేనన్నారు. ఒక్కో సెక్టోరల్ అధికారికి 10 నుంచి 12 పోలింగ్ కేంద్రాల పరిధి ఉంటుందన్నారు. వీరికి ఎన్నికల సమయంలో మెజిస్టీరియల్ అధికారాలు ఉంటాయన్నారు. తమ పరిధిలోని ప్రతి పోలింగ్ కేంద్రాన్ని మూడు సార్లు సందర్శించి వసతులు, ఓటర్లకు అనుకూలతలను పరిశీలించాలని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల నుంచి ఎన్నికల కోడ్ ప్రవర్తనా నియమా వళి అమల్లోకి వస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు, పోలింగ్ సిబ్బందికి వసతుల విషయమై లోటు పాట్లు ఉంటే వెంటనే స్పందించాలన్నారు. తమ పరిధిలో రాజకీయ, శాంతి భద్రతల పరిస్థితులు ఎలా ఉన్నాయో పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి ఎన్నికలను కొత్తగానే చూడాలని, ఏ దశలోనూ ఎటువంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయి వసతులు కల్పించాలని, దివ్యాంగులు, గర్భిణులు, వయోవృద్ధుల కోసం ర్యాంపులు నిర్మించాలన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా కేటాయించిన విధులను సమర్థంగా నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఎటువంటి పార్టీ కార్యాలయం ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలపై అవగాహన, ఏఎంఎఫ్ ఈఎంఎఫ్‌ల ఫెసిలిటేట్ చేయడం, పోలింగ్ కేంద్రాల పరిశీలన, ప్రి–పోల్, పోస్ట్ పోల్‌లో విధులు, బాధ్యతలు వివరించారు. సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని సహాయ ఓటర్ల నమోదు అధికారులు సీహెచ్ ఉష (సత్తెనపల్లి), హరిబాబు (రాజుపాలెం), లక్ష్మీనారాయణ (నకరికల్లు), మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ముప్పాళ్ళ డిప్యూటీ తహసీల్దారు సి.లక్ష్మీప్రసాద్, ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ బోస్‌బాబు, 31 మంది సెక్టార్ అధికారులు హాజరయ్యారు.

నిబంధనలతో ప్రమాదాలకు అడ్డుకట్ట



సత్తెనపల్లి: ట్రాఫిక్ నియమాలు పాటిస్తే ప్రమాదాలు నివారించవచ్చని పట్టణ సీఐ పి.ప్రభాకర్ అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలో గురువారం 'రహదారి భద్రత – జీవితానికి రక్షణ' అనే అంశంపై ఆటో డ్రైవర్లు, కార్ల డ్రైవర్లుతో సమావేశం నిర్వహించారు. సీఐ ప్రభాకర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహందారుల్లో అవగాహన కల్పించేందుకు భద్రత వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. సమావేశంలో పట్టణ ఎస్‌ఐలు ఎం. సంధ్యారాణి, ఎం.సత్యనారాయణ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

నులిపురుగుల నివారణ దినోత్సవం విజయవంతం చేయాలి

సత్తెనపల్లి: జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ యు.ఎస్.ఎల్ కవిత అన్నారు. పణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి అల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడతాయన్నారు. నులి పురుగులు సోకిన పిల్లలు వివిధ ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారన్నారు. మండల పరిధిలో ఉన్న అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లోని 2–19 ఏళ్ల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. సమావేశంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ ఎస్‌వీఎస్ సాయి తేజ రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ పిట్టల శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, హెచ్‌వీలు జె.సంపూర్ణ, వి వరలక్ష్మి, సూపర్‌వైజర్ షేక్ కరీముల్లా, ఆశ కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అందరికీ అల్బెండజోల్ మాత్రలు

ముప్పాళ్ళ: జాతీయ నులి పురుగుల నివారణ కార్యక్రమంలో శుక్రవారం 19 సంవత్సరాలలోపు పిల్లలందరి చేత అల్బెండ జోల్ మాత్రలు మింగించాలని పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి చెప్పారు. స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో గురువారం సమావేశం నిర్వహించారు. మండలంలో మొత్తం 8,600 మంది పిల్లలున్నట్లుగా గుర్తించామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, గురుకులాలు, మదర్సాలోని విద్యార్థులందరికీ మాత్రలు అందించటం జరుగుతుందన్నారు. పాఠశాలలకు వెళ్లని పిల్లలకు కూడా మాత్రలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు జయకృష్ణ ప్రవీణ్, సీహెచ్ఓ ఆంజనేయులు, సూపర్ వైజర్లు పీటర్ డేమియన్, జోస్పిన్ రాణి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

క్రోసూరు పీహెచ్‌సీ పరిధిలో 14,111 మందికి..

క్రోసూరు: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేస్తామని పీహెచ్‌సీ వైద్యురాలు ఎస్. రమాదేవీ గురువారం తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు 1–19 సంవత్సరాల లోపు వారందరికీ నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ జరుగుతుందన్నారు. 14,111 మందికి లక్ష్యంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

రాజుపాలెంలో 8,750 మంది పిల్లలకు

రాజుపాలెం: మండలంలో రెండేళ్లు నిండిన ప్రతి ఒక్కరికి అల్బెండజోల్ మాత్రలు అందించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి కె.వెంకట కృష్ణకుమార్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 19ఏళ్ల లోపు పిల్లలందరికీ నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీపై గురువారం ఆరోగ్య సిబ్బందికి అవగాహన సమావేశం నిర్వహించారు. మండలంలో 8750 మంది పిల్లలకు శుక్రవారం అల్బెండజోల్ మాత్రలు వేయనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం పాఠశాలల వారీగా ఉపాధ్యాయులకు మాత్రలు అందజేశారు. ఎంఈఓ మల్లికార్జునశర్మ, హెల్త్ సూపర్ వైజర్ జీవన్‌రావు, హెల్త్ అసిస్టెంట్లు రాజు, రాజ్యలక్ష్మి, తిరుపతమ్మ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వేగంగా కులగణన సర్వే చేయాలి

నకరికల్లు: కుల గణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీవో అన్నారు. మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో కుల గనణ పక్రియను గురువారం డి.జయమణి పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయం సిబ్బందితో సమావేశం నిర్వహించి, సూచనలు చేశారు. సంక్షేమ పథకాలు అర్హులందరికి అందాలంటే కులగణన వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్త్ కార్డులను లబ్ధిదారులకు సత్వరమే పంపిణీ చేయాలన్నారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి కె.అప్పారావు, వీఆర్వో యువరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ జయమణి

ముస్లింలు విద్యావంతులు కావాలి

బ్రదర్ సిరాజ్‌రహమాన్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: ముస్లింలు విద్యావంతులు కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇస్లాం మత ప్రచారకులు బ్రదర్ సిరాజ్ రహమాన్ అన్నారు. క్రోసూరు మార్కెట్‌యార్డులో గురువారం ఏర్పాటు చేసిన మోటివేషన్ కార్యక్రమంలో బ్రదర్ సిరాజ్ పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సిరాజ్ మాట్లాడుతూ ముస్లిం కుటుంబంలోని పిల్లలను బాగా చదివించాలని , తద్వారా ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరావు మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బీజేపీతో జత కలిస్తే ముస్లిం రిజర్వేషన్లు ఎత్తివేస్తారన్నారు. ముస్లింలకు అండగా నిలిచింది దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరెడ్డి, అయన తనయుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. తెలంగాణలో బీజేపీ ఎన్నికల సమయంలో ముస్లిం రిజర్వేషన్లు తొలిగిస్తామని ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. టీడీపీ బీజేపీతో జత కలిస్తే ఇక్కడా అదే జగరుతుందనే విషయాన్ని ముస్లిం సోదరులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ ఆర్గనైజర్ సిద్ధిఖీ, బ్రదర్ సిరాజ్ రహమాన్‌ను ఎమ్మెల్యే సత్కరించగా.. ఆయనను సిరాజ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలాగఫూర్, షేక్ ఖాదర్, ఐదు మండలాల నుంచి ముస్లింలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బ్రదర్ సిరాజ్, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

ములకలూరులో లేగదూడల ప్రదర్శన

నరసరావుపేట రూరల్: లేగదూడల సంరక్షణలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే మేలుజాతి పాడి పశువులను తయారు చేసుకోవచ్చని పశుసంవర్ధక శాఖ ఏరియా వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని ములకలూరు పశువైద్యశాలలో గురువారం లేగదూడల ప్రదర్శన నిర్వహించారు. ములుకలూరు, పెదరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన 69 లేగదూడలు ఈ ప్రదర్శలో పాల్గొన్నాయి. మేలైన మూడు లేగ దూడలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నేటి లేగదూడలే రేపటి పాడి పశువులు అని తెలిపారు. మెరుగైన పద్ధతులతో నాణ్యమైన పాల దిగుబడి సాధించవచ్చని తెలిపారు. ములకలూరు పశువైద్యశాల వైద్యుడు డాక్టర్ ఎం.అర్జునరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామ సర్పంచ్ జే.యేసుదయ, ఎంపీటీసీ సయ్యద్ మస్తాన్‌బీ, పలువురు పశువైద్యాధికారులు, రైతులు పాల్గొన్నారు.

11న వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం

సత్తెనపల్లి: పట్టణంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో ఈ నెల 11న మాఘ శుద్ధ విదియను పురస్కరించుకొని అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా దేవాలయంలో కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం బాధ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు క్షీరాభిషేకం, కోలాట ప్రదర్శన ఉంటుందన్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనాలని తెలిపారు.

నాటు సారా కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ నాటు సారా కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార గురువారం తెలిపారు. నకరికల్లు మండలం చేజర్ల తండాలో తనిఖీలు నిర్వహించామన్నారు. అక్కడ అక్రమంగా 10 లీటర్లు నాటుసారా కలిగి ఉన్న బాణావత్ రామకృష్ణా నాయక్‌ను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

మైనర్లూ.. వాహనాలు నడపకండి

చిలకలూరిపేట: మైనర్లు వాహనాలు నడపకూడదని, పిల్లల తల్లిదండ్రులు వారికి వాహనాలు ఇవ్వకూడదని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ టీవీ నాగలక్ష్మి చెప్పారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని చౌదరయ్య పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మైనర్లకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం, అతివేగంగా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని వెల్లడించారు. పిల్లలు మోటార్ సైకిల్, కారు రేసింగ్‌లకు అలవాటుపడకుండా తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ సీఐ రమేష్, ఆర్టీసీ డీఎం రాంబాబు, స్కూల్ డైరెక్టర్ ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.